క్లుప్తంగా

మంత్రిని బర్తరఫ్ చేయాలి

సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



మాట్లాడుతున్న దేవేందర్, నాయకులు

శంకర్‌పల్లి: ప్రైవేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని సీఐటీయూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం శంకర్‌పల్లిలో సీఐటీయూ నాయకుల సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొండకల్ తండాలోని గిరిజనుల అసైన్డ్ భూములను కొన్ని ప్రైవేట్ కంపెనీలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నాయని, దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మద్దతు ఇస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజనుల భూములను తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, రాములు, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి



సక్కుబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్యదర్శులు

కేశంపేట: మహేశ్వరం మండలంలోని ఎన్‌డీ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సక్కుబాయి మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల కార్యదర్శులు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శులు నదీమ్, శ్రీనివాస్, జగన్, విద్యావతి, మల్లేశ్, రమేశ్, యాదగిరి, ప్రశాంతి, రమాదేవి తదితరులు ఉన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: వెంకటాపూర్ నుంచి నక్కలపల్లి, చేవెళ్ల రహదారికి బీటీ వేయడం అభినందనీయమని నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి నుంచి వెంకటాపూర్ గ్రామం వరకు బీటీరోడ్డు పనులను గ్రామస్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో అంజయ్యగౌడ్, మల్లారెడ్డి, కొండ నర్సింలుగౌడ్, మాసుల జీవన్, అరవింద్, వెంకటేశ్, సంగిరాజు, కొండ మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జయమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

షాబాద్: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తల్లి కావలి జయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం మండల పరిధిలోని మద్దూర్ గేట్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జయమ్మ దశదిన కర్మలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కావలి చంద్రశేఖర్‌ను పరామర్శించారు.

మహాజన సభను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించే మహాజన సభను విజయవంతం చేయాలని బుధవారం పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సభ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని, 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన సంఘం నివేదికపై చర్చిస్తామని పేర్కొన్నారు. ఈ సభలో పాలకవర్గ డైరెక్టర్లు, మండల పరిధిలోని రైతులు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పోలారంలో రైతులు సాగుచేస్తున్న క్యారెట్ పంట



గోపిగడ్డలో కాలీఫ్లవర్ పంట

పల్లెలు.. కూరగాయల ముల్లెలు

ఊరంతా అన్నిరకాల ఆకు, కూరగాయల సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న సర్దార్‌నగర్, పోలారం, గోపిగడ్డ గ్రామాలు
- ఆరుతడి పంటలతో లాభాలు గడిస్తున్న రైతులు

షాబాద్: ఒకరిద్దరూ కాదు.. మూడు గ్రామాల్లో ఊరంతా కూరగాయల సాగు చేస్తున్నారు. పది గుంటల నుంచి మొదలు ఎకరా, రెండెకరాలు ఉన్న రైతులు కూరగాయలతో పాటు ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. పెద్దగా నీటి వనరులు లేకపోయినా ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. తక్కువ సమయంలో చేతికి వచ్చే ఆరుతడి పంటలు సాగు చేస్తూ మండలంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

మండల పరిధిలోని సర్దార్‌నగర్, పోలారం, గోపిగడ్డ గ్రామాల రైతులు సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని పోలారం గ్రామంలో 105 కుటుంబాలు, సర్దార్‌నగర్ గ్రామంలో 5 కుటుంబాలు, గోపిగడ్డ గ్రామంలో 65 రైతు కుటుంబాలు నివాసముంటారు. ఇక్కడి రైతులు టమాటా, వంకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ, కాలిఫ్లవర్, చిక్కుడు, కీర, బీరకాయ, పచ్చిమిర్చితో పాటు తదితర పంటలను సాగుచేస్తారు. వర్షాలు లేకున్నా డ్రిప్, స్ప్రింక్లర్ల సహాయంతో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, గుడ్డిమల్కాపూర్ మార్కెట్‌కు కూరగాయాలు తీసుకెళ్తే అక్కడి వ్యాపారులు ముందుగా ఈ కూరగాయలనే కొనుగోలు చేస్తారని రైతులు చెబుతున్నారు. సీజన్‌ను బట్టి ఆకుకూరలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, బెండా, గోకరకాయ, చామగడ్డా, చిక్కుడు సాగు చేస్తున్నారు. ఎక్కువగా ప్రతీ రైతు అధిక లాభాలను ఇచ్చే కూరగాయల సాగు చేయడం విశేషం. ఒక్కసారి పాలకూర పంటను వేస్తే నెలరోజుల వరకు ప్రతిరోజు 2వేల రూపాయలు సంపాదించుకుంటామని రైతులు చెబుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగుతోనే కుటుంబ పోషణ చేసుకుంటారు. కానీ ఆకుకూరలు పండించే రైతులకు రెండెకరాల భూమి మాత్రమే ఉంది. బోర్లు వేసుకోవడంతో రైతులకు సాగు నీటికి అంతా కష్టం లేకపోవచ్చని, నివాస గృహాలకు పొలాలు ఆనుకొని ఉండడం వారికి ఈ ఆకుకూరల సాగు లాభాలను తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు. కుటుంబ సభ్యులంతా పొలంలోనే పని చేస్తారు. పోలారం గ్రామంలో 105 రైతు కుటుంబాలుండగా, 390కుపైగా ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. నీటి వనరులు ఆ ఊరికి పెద్దగా లేవు. చిన్నపాటి పది కుంటలు తప్పా సాగు నీరు ఎరుగని ఊరు అది. 500 నుంచి 600 ఫీట్లలోతు బోర్లు తవ్వినా చెప్పుకోదగ్గ నీటి ఊటలు లేవు. వచ్చే కొద్దిపాటి నీటితో ఆ గ్రామస్తులు ఆరుతడి పంటలు పండిస్తూ లక్షల ఆదాయం గడిస్తున్నారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



గతంలో ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీపై కూరగాయల విత్తనాలు ఇచ్చేది. ప్రస్తుతం వాటిని ఇవ్వడం మానేశారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సబ్సిడీ విత్తనాలతో పాటు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఇచ్చి ఆదుకోవాలి.

–మహేందర్‌రెడ్డి, రైతు, పోలారం

ఒక్కో రైతు పది రకాలు



మా గ్రామంలో రైతులు అన్నిక రాల కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాటా, వంకాయ, పచ్చిమిర్చి, దోసకాయ, బీరకాయ, కొత్తిమీర, చిక్కుడుతో పాటు పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. 1 ఎకరంలో క్యారెట్ పంట సాగు చేస్తే రూ.1లక్ష వరకు వస్తుంది. ఖర్చులు పోను రూ.2లక్షల ఆదాయం వస్తుంది.

–వెంకట్‌రెడ్డి, రైతు, పోలారం

మక్కువతోనే నర్సరీ ఏర్పాటు



వ్యవసాయంపై మక్కువతోనే నా సొంత పొలంలో కూరగాయల సాగుతో పాటు నర్సరీ ఏర్పాటు చేసి గులాబీ, చామంతి నారు మొక్కలు పెంచుతున్నాను. నీటి కొరతతో డ్రిప్, మల్చింగ్ పద్ధతుల్లో సాగుచేస్తున్నాం. బోరు ఆగి ఆగి పోస్తుండటంతో డ్రిప్ సాయంతో సాగు చేశాను. మాతో పాటు మరో 15 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. నెలకు అన్ని ఖర్చులు పోను రూ.1లక్ష వరకు ఆదాయం వస్తుంది.

–దాదే అమృత్‌రాజ్, రైతు, సర్దార్‌నగర్

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

ఏఈ ఈశ్వర్



ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న సిబ్బంది

కేశంపేట: వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఏఈ ఈశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌కు గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ నుంచి 33 కేవీ విద్యుత్‌లైన్ ఉండటంతో చాలాసార్లు విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో అక్కడి నుంచి 33 కేవీ విద్యుత్ లైన్‌ను నూతనంగా వేశామని తెలిపారు. వేసవికాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అర్తింగ్‌లకు ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరాఫరా చేస్తున్నామన్నారు. మండలంలో ఇప్పటివరకు లోఓల్టేజీ సమస్యలు తలెత్తలేదని, గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే సిబ్బంది అందుబాటులో ఉంటారని, సొంతంగా ఎలాంటి పనులు చేసుకోవద్దని ఆయన కోరారు.

విద్యార్థులకు సామాజిక సేవ అవసరం

యూత్ కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్



స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు నక్కలపల్లి గ్రామంలో రెండోరోజు వేసవి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలో వీధులన్నీ తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రోడ్లు శుభ్రం చేశారు. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ధూమపానం, మద్యం నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

కొందుర్గు: రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చౌదరిగూడ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బాబురావు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, మాటకు కట్టుబడి మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల్లోని ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి 20వేల కోట్ల నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయిలో నియామకం చేయాల్సిన ప్రతీ అంశంలో డిక్లరేషన్‌ను అనుసరించి చేపట్టాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ బీసీలకు ఉద్యోగ నియామకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం బీసీ ఉపకులాలకు అమలు చేసిన బీసీ బంధును కొనసాగించాలన్నారు. గొల్ల కురుమ యాదవులు గొర్రెల కోసం డీడీలు కట్టారని, వాటిని పునపరిశీలించి త్వరగా గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, బీఆర్ఎస్ మండల ప్రధాన కర్యాదర్శి యాదయ్య, అజయ్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ముఖద్వారానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ప్రధాన తాంత్రి కంఠారు రాజీవారు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ పారిశ్రామిక వాడ సమీపంలో అయ్యప్ప ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శబరిమల అయ్యప్ప ఆలయ ప్రధాన తాంత్రి కంఠారు రాజీవారు తమ బృందంతో కలిసి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ గురుస్వామీ గిరిషన్‌నాయర్ ఆధ్వర్యంలో ముందుగా గణపతి హోమం నిర్వహించిన అనంతరం నాగదేవత, గణపతి, అమ్మవారి విగ్రహాలు, అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తిగీతాలు, శరణు ఘోషలతో ఆ ప్రాంతమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప ఆలయానికి ముఖద్వారం నిర్మాణానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి పలువురు గురుస్వాములతో కలిసి శంకుస్థాపన చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 2వ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్, జేబీఐటీ కళాశాల, భాస్కరా మెడికల్ కళాశాల, స్వామినారాయణ గురుకుల్ పాఠశాల తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీ

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీని ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీని ఇవ్వాలని మున్సిపల్ శాఖ నిర్ణయించినట్లు తెలిపారు. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10 వడ్డీ చెల్లించిన వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ వర్తిస్తుందని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో భాగంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గొర్ల కురుమలు 70లక్షల మంది ఉన్నారని, బీసీ నేత బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని గౌరవించాలని కోరారు. రాష్ట్రంలో యాదవ వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైన వ్యక్తి ఐలయ్య అని అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం గొల్ల కురుమలు జనాభాలో రెండో స్థానంలో ఉన్నారన్నారు. గొల్లకురుమ సామాజిక వర్గానికి చెందిన ఐలయ్యకు మంత్రి కల్పిస్తే సమన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు అంజన్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, తిరుమలేశ్ యాదవ్, భాను ప్రకాశ్‌యాదవ్ పాల్గొన్నారు.

చెరువు నీటిని కాపాడుకుందాం

వాటర్ ఎయిడ్ ఇండియా కమ్యూనిటీ వర్క్ అధికారి రేవతి



నక్కలపల్లి చెరువులో బోరును ప్రారంభిస్తున్న అధికారి రేవతి, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: చెరువులు, కుంటల్లో నీరు ఎండిపోయినప్పుడు నీటిని బయటకు తీసి చెరువులు, కుంటలు నింపడంతో మూగజీవాలతో పాటు చుట్టుపక్కల బోరు బావులకు ఉపయోగపడతాయని వాటర్ ఎయిడ్ ఇండియా కమ్యూనిటీ వర్క్ అధికారి రేవతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో చెరువు కట్ట సమీపంలో ఇన్‌జక్షన్ వెల్(వాటర్ రిచార్జీ స్ట్రక్చర్) నిర్మించడానికి బోరు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వాటర్ ఎయిడ్ ఇండియా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారి రేవతి మాట్లాడుతూ.. దేశంలో చెరువులు, కుంటలు ఎండిపోకుండా చూడడానికి వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్‌జక్షన్ వెల్ కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా నక్కలపల్లి గ్రామంలో చెరువు కట్ట సమీపంలో బోరు వేయించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు అంజయ్యగౌడ్, రవీందర్, జీవన్, సత్తయ్య, నరేందర్, పందారయ్య తదితరులు ఉన్నారు.

అయ్యప్ప మహిమ ఎంతో గొప్పది



స్వామివారి పూజలో పాల్గొన్న పట్నం సాన్విరెడ్డి, స్వాములు

షాబాద్: అయ్యప్ప స్వామి మహిమ ఎంతో గొప్పదని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి సతీమణి పట్నం సాన్విరెడ్డి అన్నారు. బుధవారం నందిగామలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవ పూజల్లో ఆమె పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సృష్టిలో అయ్యప్ప స్వామి దీక్ష చాలా శక్తివంతమైనదని, స్వామి కృప అందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, మండల గురుస్వాములు దర్పల్లి రవీందర్‌గౌడ్, కమ్మరి శ్రీను, నాగేందర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భీంలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

షాద్‌నగర్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి నిషాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటవేటర్, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, పవర్ స్ప్రేయర్, మ్యానువల్ స్ప్రేయర్, బ్రష్ కట్టర్, బండ్ ఫార్మర్ వంటి వ్యవసాయ పరికరాలను వ్యవసాయ శాఖ మహిళా రైతులకు సబ్సిడీపై అందజేస్తుందని తెలిపారు. భూమి ఉన్న మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

సీఐ భూపాల్‌శ్రీధర్



మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐలు

చేవెళ్ల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని రావులపల్లి గ్రామంలో సీసీ కెమెరాలను సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శిరీష ప్రారంభించారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులు లేక పనిచేయకపోవటంతో పోలీసుల సూచనలతో మాజీ సర్పంచ్ జి.రాంచంద్రయ్యగౌడ్ ముందుకొచ్చి అన్నింటిని బాగుచేయించి అందుబాటులోకి తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, కేసారం నరేందర్, సత్యనారాయణ, అశోక్, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ.. అందని కూలి

- మండు వేసవిలో పనిచేసినా సకాలంలో అందని బిల్లులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పనులకు రావడానికి వెనుకడుగు



కొందుర్గులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొందుర్గు: కనీస వేతనం గిట్టుబాటు కాకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు ఉపాధి కూలీలు వస్తున్నారు. అయినా వారికోసారి చెల్లించే బిల్లులు మూడునెలల నుంచి అందకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. వారానికోసారి వేతనాలు వస్తాయని పనులకు వస్తున్న కూలీలకు పస్తులు తప్పడం లేదు. అధికారులు దృష్టిసారించి సకాలంలో పెంచిన వేతనాలు అందించాలని కోరుతున్నారు.

గిట్టుబాటు కావడం లేదని..

మండలంలోని 22 గ్రామపంచాయతీలకు సంబంధించి దాదాపు 5వేలకు పైనే జాబ్‌కార్డులు ఉన్నాయి. రోజుకు సగటున 1500 మంది కూలీలు ఉపాధి పనులు చేసేవారు. కానీ కూలీలకు సరిగా గిట్టుబాటు కావడం లేదని, సకాలంలో కూలీ డబ్బులు రావడం లేదని పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 800 మంది మాత్రమే కూలీలు పనులకు వెళ్తున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నుంచి ఇప్పటివరకు చేసిన పనులకు కూలీ డబ్బులు అందలేదు. బయట కూలీకి వెళ్తే రోజుకు రూ.500లు ఇస్తున్నారని, ఉపాధి హామీలో కేవలం రూ.300 మాత్రమే ఇస్తున్నారని కూలీలు వాపోతున్నారు. సాధారణంగా ప్రతిఏటా వేసవికాలంలో కూలీలకు ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 30శాతం కూలీరేట్లు పెంచడం జరిగేది. కానీ ఈ ఏడాది ఇంకా కూలీ రేట్లు పెంచడం లేదు. దానికి తోడు తమకు కూలీ డబ్బులు సకాలంలో రావడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో మార్చి వరకు 2.50లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం ఒక లక్ష పనిదినాలు పూర్తయినట్లు తెలిసింది.


కూలీ రేట్లు పెంచాలి



మండుతున్న ఎండలకు ఓర్చుకొని కూలీలు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే కూలీ డబ్బులు ఎందుకు సరిపోవడం లేదు. నిత్యావసర సరుకుల రేట్లు విపరీతంగా పెరిగినా కూలీరేట్లు పెంచడం లేదు. కూలీల రేట్లు వెంటనే పెంచాలి. కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు వేయించాలి. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి

–బుద్దుల జంగయ్య, సీపీఐ నాయకుడు

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం



కూలీలందరికీ ఉపాధి కల్పించడమే సర్కారు లక్ష్యం. కూలీల హాజరును ఎప్పటికప్పుడూ నమోదు చేసి, కూలీ డబ్బుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కాస్త ఆలస్యమైనా డబ్బులు వస్తున్నాయి. నాలుగైదు వారాలకొకసారి కూలీల డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి.

–లక్ష్మీఅనురాధ, ఎంపీడీఓ